# తెలుగోడు




శశి కిరణాచారి.కె

Final

PDF created with pdfFactory Pro trial version www.pdffactory.com

# తెలుగోడు

శశికిరణాచారి.కె

Final

లైఫ్‌లైన్ కమ్యూనికేషన్స్
సికిందరాబాదు

PDF created with pdfFactory Pro trial version www.pdffactory.com


# అంకితం

"అ ఆలు నేర్చింది - అమ్మ ఒడిలోనే
అడుగడుగూ ఎదిగింది - అమ్మ నీడలోనే"

మా అమ్మ
కొమాండూరి విజయవరలక్ష్మికి

Final

PDF created with pdfFactory Pro trial version www.pdffactory.com



హైదరాబాదు
11.11.2005

ముఖ్యమంత్రి
ఆంధ్రప్రదేశ్

డా॥ వై.యస్. రాజశేఖర రెడ్డి

# సందేశం

శ్రీ కె. శశికిరణాచారి "తెలుగోడు" పేరిట తెలుగుజాతి సంస్కృతీ వికాసాన్ని పుస్తక రూపంలో అభివర్ణించడం ఎంతైనా ముదావహం.

తెలుగు జాతికి తరతరాలుగా వైభవోపేతమైన ఘనచరిత్ర వారసత్వంగా సంతరించింది. అచ్చమైన తెలుగు దనం తొణికిసలాడే కమనీయమైన తెలుగు భాషను వీనుల విందుగా పరిగణించిన పాశ్చాత్యులు "ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్" అని కొనియాడారు.

తెలుగుదనాన్ని గూర్చి, తెలుగువారి సంస్కృతిని గూర్చి సరళమైన శైలిలో దశలవారీగా రమ్యంగా వర్ణిస్తూ కవితా రూపంలో ఏర్చికూర్చిన శ్రీ శశికిరణాచారిని హృదయ పూర్వకంగా అభినందిస్తున్నాను.

(వై. యస్. రాజశేఖర రెడ్డి)

Final

PDF created with pdfFactory Pro trial version www.pdffactory.com

...anpith Awardee
... C. Narayana Reddy Ex. M.P
M.A., Ph.D., D.Litt
...ESIDENT
...ndhra Saraswatha Parishath Trust
...k Road, Hyderabad - 500 001
...ne (Off.) 24753724

జ్ఞానపీఠ అవార్డు గ్రహీత
డాక్టర్ సి. నారాయణరెడ్డి ఎక్స్ ఎం.పి.
ఎం.ఏ. పిహెచ్.డి. డి.లిట్.
అధ్యక్షులు
ఆంధ్ర సారస్వత పరిషత్తు ట్రస్టు
తిలక్ రోడ్, హైదరాబాదు-500 001.
ఫోన్ : (ఆ) 24753724

... 3775/2005

తేది 30.08.2005



# అభినందన

ఈ కవితా సంపుటిలో శశికిరణాచారి తెలుగుజాతి చరిత్రను గేయరూపంలో ఉల్లేఖించాడు.

తెలుగంటే, తెలుగువాడంటే శశికిరణ్‌కు ఒళ్ళంతా పారవశ్యమే. ఈ సంపుటిలోని కొన్ని పంక్తులు ద్విపదల్లా సాగిపోతాయి. కొన్ని సీస పద్యాల్లా కదం తొక్కుతాయి. మరికొన్ని మాత్రాచ్ఛందస్సులోని ఖండగతిలో కదిలిపోతాయి. అయితే, కవే స్వయంగా సూచించినట్టు మాత్రల సంఖ్యా నియతిలో నిర్దిష్ట గతిలో లోపాలున్నట్టు కనిపించినా ధారమాత్రం ఎక్కడా లోపించలేదు.

శశికిరణాచారి ఆశించినట్టుగా ప్రతి తెలుగువానికి ఆత్మాభిమానం పరిపూర్ణంగా ఉన్నప్పుడే తెలుగుజాతి వ్యక్తిత్వం సమస్త భరతావనిలో అచంచలంగా నిలిచిపోతుంది. ఈ గేయకృతిని రచించడానికి ఉద్యుక్తుడైన శశికిరణాచారికి నా హార్దికాభినందన.

Final

PDF created with pdfFactory Pro trial version www.pdffactory.com

# నా మాట

ప్రతి నాగరక జాతివారు తమ మాతృభాషలోనె మాట్లాడుకుంటారని అంటారు. అయితే నవతరం తెలుగు వారు మాత్రం ఈ విషయాన్ని విస్మరిస్తున్నారు. ఈ రోజుల్లో ఏ టి.వి. ఛానల్లో చూసినా, ఏ పాఠశాలకు వెళ్ళి పలకరించినా, స్వచ్ఛమైన తెలుగులో మాట్లాడేవారు చాలా అరుదుగా కనిపిస్తారు. మాతృభాషను చదవడం అటుంచి మాట్లాడటానికే జంకుతుంటారు. ఈ విషయాన్ని గమనించినపుడు తెలుగుభాష నిర్లక్ష్యానికి గురవుతున్నదని చెప్పక తప్పదు. ఈ వాస్తవాన్ని నలుగురూ చర్చించేలా చేసి తెలుగుపై మమకారాన్ని పెంచడానికి చేసిన చిరు ప్రయత్నమే నా ఈ "తెలుగోడు".

తెలుగుభాష ఎంతో మధురమైనది. ఆదికవి నన్నయ్య గారి నుండి ఆధునిక మహాకవి నారాయణరెడ్డిగారి వరకు అమూల్యమైన విషయ విజ్ఞానం తెలుగు సాహిత్యంలో వచ్చింది. అందులో వాడి, వేడిని అందరు ఆస్వాదించకపోయినా కొందరు మాత్రం ఆస్వాదిస్తూ ఆదరిస్తున్నారు. కాలానుగతంగా అనేకానేక మార్పులకు లోనైన తెలుగు ఇంకా సజీవంగా ఉందంటే వీరే కారణం. అయితే రానురాను వీరి సంఖ్య తగ్గిపోతూ భాష ఉనికికే ప్రమాదంగా మారే పరిస్థితులు నెలకొన్నాయి. ఇటువంటి పరిస్థితుల్లో తెలుగుభాష గొప్పదనాన్ని చాటిచెప్పడమే ఈ "తెలుగోడు" లక్ష్యం.

ఈ పుస్తకాన్ని చదివిన ప్రతి ఒక్కరు కనీసం ఒక్క క్షణమైనా ఆలోచిస్తే నా కృషి ఫలించినట్లే.

Final

PDF created with pdfFactory Pro trial version www.pdffactory.com

భావ ప్రకటనే ధ్యేయంగా సాగిన ఈ పుస్తక రచనలో గతి, శబ్ద, లయ భేదాలుంటే విజ్ఞులు అర్థం చేసుకుంటారనే నా ఆకాంక్ష.

నా ఈ ప్రయత్నాన్ని అభినందించి, తమ సందేశంతో ఉత్సాహాన్నందించిన మన రాష్ట్ర ముఖ్యమంత్రి డా. వై.యస్. రాజశేఖర రెడ్డి గారికి నా ప్రత్యేక కృతజ్ఞతాభివందనాలు.

ఈ పుస్తకాన్ని చదివి, అభినందించి ఆశీర్వదించిన మహాకవి, జ్ఞానపీఠ పురస్కార గ్రహీత, పద్మభూషణ్ డా॥ సి. నారాయణరెడ్డిగారికి నా కృతజ్ఞతాభివందనాలు. తమ సహాయ సహకారాలనందించిన ప్రముఖపాత్రికేయులు, ఆంధ్రజ్యోతి దినపత్రిక సంపాదకులు కె. రామచంద్రమూర్తి గారికి నా కృతజ్ఞతలు. అమూల్యమైన సలహాలనందించిన ప్రముఖ కవి డా॥ తిరుమల శ్రీనివాసాచార్యగారికి నా ప్రత్యేక కృతజ్ఞతలు. ఈ పుస్తక రచనను ప్రోత్సహించిన సన్నిహిత మిత్రులు, విద్యుత్‌రంగ నిపుణులు కె. రఘుగారికి, మెరుగులు దిద్దడానికి సహకరించిన మిత్రులు, కళాకారులు రామలింగ శరణ్ గారికి, కళాభిమాని, వెన్నంటి నిలిచే మిత్రులు వెంకట్రామయ్యగారికి, నా సహచరమిత్రులు ఈశ్వర్, గోవర్ధన్ బాలాజీలకు, ముద్రణ గ్రాఫిక్స్ శ్రీధరమూర్తిగారికి, ఇతర మిత్రులకూ నా కృతజ్ఞతలు. ముఖచిత్రం వేసిన అక్బర్‌గారికి, చక్కగా అచ్చువేసి సకాలంలో ఇచ్చిన ఓం సాయి గ్రాఫిక్స్ రాంరెడ్డిగారికి నా ధన్యవాదములు. ఎల్లప్పుడూ సహకరించే మా అన్నయ్య, ఉపాధ్యాయులు కొమాండూరి వేంకటగోపాలాచార్యులకు సర్వదా కృతజ్ఞుణ్ణి.

- శశికిరణాచారి

Final

PDF created with pdfFactory Pro trial version www.pdffactory.com

అచ్చమైన తెలుగు
ఎచ్చట యున్నదో
అచ్చటే పడవేయ
వచ్చు గాని

ముచ్చటేమి నీకు
ముక్కంటి నాపై
ఇచ్చోట దోసి ఎద-
చిచ్చు రేపావు

నిత్యనూతనమైన
నుడికారసొబగులు
అత్యంత రమణీయ
అక్షరాక్షరములు

చిక్కనైన లేత
జవరాలిచెలువంపు
చక్కనైనతీపి
పలుకుబళ్ళు

ముత్యాలహారాన
కొలికిపూసల్లాంటి
మృదుమధుర కీర్తనల
మెరుపుజల్లు

ఏమి పాపము జేసె
తిరుమలేశా!
ఏమాయె ఆగాన-
మాధురుల ఉఛ్వాస

అదృష్టమైనా
దురదష్టమైనా
రాసేది నీవు
నిక్కమిది విధాత

దురదృష్టవంతున్ని
చేసినా వెరవనూ
రాసినానంటివా
తెలుగులో తలరాత

*****************

Final



PDF created with pdfFactory Pro trial version www.pdffactory.com

సత్యలోకమునున్న
శారదామూర్తికే
మర్త్యలోకముమీద
మనసుపడగా

మనసులోభావాలు
పంచుకొనగానెంచి
ఆంధ్రలోకములోన
అడుగులిడగా

గోదారిగలగలలు
కృష్ణమ్మకిలకిలలు
పరవశమ్మునలేచి
పరవళ్ళుతొక్కగా

అందులోపుట్టినది
ఆంధ్రజనవాణి
అక్షరాలుగమారి
పలుకగాశ్రీవాణి

అదియెతెలుగుభాష
అదియెతెలుగుభాష
అందించినదిమనకు
ఆంధ్రమాత

సరళమైనభాష
సలిలసంజాత
సంభాషణమునకే
సరియైనజోత

ముచ్చటైనభాష
మృదులసంభూత
మధురవాక్కులచేత
మనసుగాత
************

మంచి గంధపు చెక్క
మధువులోముంచి
పంచదారచిలక
పాళీగ మార్చి

Final



PDF created with pdfFactory Pro trial version www.pdffactory.com

కుంచె గీసినట్టి
కుడ్య చిత్రాలు
కుందనాలతెలుగు
అక్షరాలు

అ ఆలు ఇ ఈ లు
ఆస్థిగాఇచ్చి
అష్టదారిద్ర్యాన్ని
అనుభవించనిన

తెలుగు జిలుగుల
భాగ్యవంతున్ని నేనై
వెలిగిపోనా వసుధ
వేయినాళ్ళు

కోటానుకోట్ల నా
తోటిసోదరులు
ఎందుకో ఏటికెదు-
రీదుతున్నారు

నేటినుంచి రోజు
నోటికొక్కమాట
తెలుగులో నేర్పినా
తొలగు కష్టాలు

స్వచ్ఛమైనమాట
అచ్చమైనమాట
ఉచ్చరించునోట
తేనెఊట

మచ్చికైనమాట
మనసుదోచుమాట
మంచిమార్గానికే
రాచబాట

ఉచ్చరించువేళ
ఉప్పొంగు గంగలా
పలకరించువేళ
పాలవెల్లి



Final

PDF created with pdfFactory Pro trial version www.pdffactory.com

పలుకువిన్నంతనే
పడుచుజాబిల్లిలా
పులకరించిపోవు
తెలుగుతల్లి

అమ్మ మాటలోని
కమ్మదనమైనా
నాన్న మాటలోని
నమ్రతైనా

ఎల్లభాషలందు
వెతికినా దొరకదు
కల్లకాదు నిజము
నమ్ము సుమ్మీ!
***********

తెలుగునేర్చినవాడికే
తెగులుబట్టెనో
తెలియరాదు
తెలిసికొనెదమనిన

తెలుగుమాట్లాడితే
తెలివితక్కువతనము
ఏలగల్గనో మరి
చెప్పుమనిన

తెలుగురాదనిచెప్పి
తెల్లబోయిననాడు
నిలువెల్లధనమున్న
నిష్ఫలంబు

తెలుగువాడిగబుట్టి
తెలుగుమరచిననాడు
మనిషిజన్మమేల
సార్థకంబు

పెద్దబాలశిక్ష
నేర్పేటిబుద్దులు
మర్యాదరామన్న
చెప్పేటిసుద్దులు



Final

PDF created with pdfFactory Pro trial version www.pdffactory.com

మరచిపోయిమనము
దద్దమ్మలైతిమి
బుద్ధిమంతులమన్న
గర్వమేల

చిన్ననాటిచిట్టి-
చిలకమ్మపలుకులు
చందమామబాల-
మిత్రలచిత్రాలు

కనులవిందుసేయు
కమ్మనికథలు
పొట్టచక్కలుచేయు
పొడుపుకథలు

పండుముదుసలితాత
పాడేటితత్వాలు
నిండువెన్నెల్లోన
జాబిల్లిజోలలు

ఎందుకనుకున్నాము
దండగేఅనుకొని
దండిగామనతెలివి
మీరిపోయి

పరాయిభాషలో
పదిసార్లుపొగిడినా
కిరాయిసన్మాన
పత్రమనిపించు

అచ్చతెలుగులోన
మచ్చుకుతిట్టినా
మెచ్చుకోలుదోచు
ఎచ్చటయినా

పక్కవాడుచదివి
లెక్కలేనిసార్లు
నొక్కినొక్కిచెప్పు
గొప్పదనము

Final



PDF created with pdfFactory Pro trial version www.pdffactory.com

చక్కనైనతెలుగు
మాట్లాడితేకలుగు
ధిక్కరించలేని
గడుసుదనము

ఎల్లభాషలకు
తల్లి సంస్కృతంబు
ఎప్పుడోబుట్టెను
యేళ్ళనాడు

ఇప్పుడదిచప్పబడె
ఒప్పుకరుచులకు
చేసినట్టితప్పు
తెలియరాదు
************

శ్లాఘనీయమైన
శాసనాలలోన
కన్పట్టెనాతెలుగు
కాలాలక్రితము

మార్పులకు చేర్పులకు
మధురమగుకూర్పులకు
నిలయమైనిలిచినది
నిత్యమైనగతము

ప్రజలుపలుకుచుండ
ప్రభువులుగుర్తించి
శిలలపైకెక్కింది
శిధిలమవక

మధ్యయుగమునాటి
గద్యపద్యాలతో
మనవరకుచేరింది
మాయమవక

ప్రస్తుతముపసలేని
పండితులుఎక్కువై
భాషభ్రష్టుబట్టి
భావమ్ముచెడిపోయె

Final



PDF created with pdfFactory Pro trial version www.pdffactory.com

కష్టకాలమునీకు
కన్నీళ్ళునీకు
తెలుగుతల్లిమమ్ము
మన్నించబోకు

మనసున్నప్రతివాడు
మనిషైనప్రతివాడు
మనసువిప్పిమాతృ-
భాషలోమాట్లాడు

ఆడంబరాలడం-
బాలుపలికేవాడు
అన్యభాషలోని
పడునుఅపసోపాలు
***************

అందుకేఒకమారు
అందుకేముమ్మారు
అందుకేఎలుగెత్తి
మారుమారు

తెలుగువిలువలుతెలియ
తెలుగుకురియ
తెలుగుదనమన్నదే
తెలిసిమురియ

తెలుగులోరాసేను
తెలుగులోకూసేను
"తెలుగుభారతి"బరువు
ఒక్కన్నెమోసేను

తెలుగుతోచూసేను
తెలుగుతోచేసేను
తెలుగువాడికివెలుగు
రేఖనై మెరిసేను

తెలుగులోతలచేను
తెలుగులోవలచేను
తెలుగుపిలుపుల ప్రణయ
రాగమైపలికేను



Final

PDF created with pdfFactory Pro trial version www.pdffactory.com

తెలుగునేనేర్చేను
తెలుగునేనేర్పేను
తెలుగునేర్పినఓర్పు
మార్పుగామార్చేను
****************

నన్నయ్యలా నిన్ను
పద్యాలు రాయమని
అడగలేదెపుడు నీ
ఆంధ్రమాత

తిక్కన్నలా తీపి
శిల్పాలుచెక్కమని
కోరలేదెపుడు నిను
తెనుగుతల్లి

శ్రీనాథుడొసగిన
శృంగారసారాన్ని
బంగారు పెట్టెలో
భధ్రపరచి

పెద్దన్నరచనల
శుద్ధ:ప్రబంధాన్ని
శ్రద్ధగా ఒద్దికతొ
పొందుపరచి

పోతపోసినట్టి
పోతన్న అచ్చుల
తెలుగు భాగవతము
తేటపరచి

కృష్ణరాయని కీర్తి
రామలింగని స్ఫూర్తి
భక్తి వైరాగ్యాన
ధూర్జటి అనురక్తి

తరతరాల్దాటినా
తరగని సంపదై
వెలుగుతున్న తెలుగు
పద్యకవుల భక్తి

Final



PDF created with pdfFactory Pro trial version www.pdffactory.com

ఘనమైన చరిత ఇది
గతము అందించినది
తెలిసికొమ్మనె నిన్ను
తెలుగుతల్లి.
**************

అందమైన తెలుగు
అక్షరాలకు భ్రమిసి
కవితా వధూటిని
కానుకిచ్చి

అక్షర రమ్యత
సాక్షాత్కరించగా
ఆదికవి నన్నయ్య
అమరజీవి

ప్రసన్న కథా
కలితార్థయుక్తి
నానారుచిరార్థ
సూక్తినిధిత్వము

ప్రాక్తనంబైనట్టి
ఆంధ్రసాహిత్యము
ఆంధ్రభారతాన
నన్నయ్యప్రోక్తము

కవులు కొలువు దీరి
కవితలేఅల్లగా
ప్రభువులకుపేరొచ్చె
ప్రజలుమెచ్చె

లఖియించగాభవిత
చక్రవర్తులచరిత
సువర్ణాక్షరాలు
గుచ్చిగుచ్చి

యుద్ధవిద్యలోన
బలపరాక్రమములో
రాజనీతిలోన
ఖ్యాతిలోన

Final



PDF created with pdfFactory Pro trial version www.pdffactory.com

చరితలేని రాజ-
రాజనరేంద్రుడు
నన్నయ్యప్రాపుతో
వన్నెకెక్కె
**************

అసమాన ప్రతిభతో
ఆదికవినిపించి
ఆదరణగొన్నట్టి
ధన్యజీవి

ఆంధ్ర భారతాన్ని
సాంద్రీకరించి
సోమయాజియైన
మహామేధావి

మనుమసిద్ధికి మంత్రి
మహా వేదాంతి
మహాకవులలోన
మేలుబంతి

తిక్కన్న కవితకు
తిక్కనేసాటి
చిక్కని తెలుగుల
ఘనాపాటి
**********

నన్నయ్యరమ్యత
తిక్కన్నశ్రావ్యత
కలబోసుకున్నట్టి
కమనీయ కావ్యత

ఎఱ్ఱన్నకేచెల్లు
ఎటువైపు చూసినా
ఆంధ్రసాహిత్యాన
ఆధునికత

కవిరాజశిఖామణి
నన్నెచోడునిగూర్చి
విన్నవారులేరు
నిన్నటివరకు

Final



PDF created with pdfFactory Pro trial version www.pdffactory.com

జానుతెనుగుదనము
జాలువారునటుల
పద్యసుమములల్లె
ప్రజలకొరకు

వీరశైవమనిన
బసవేశ్వరుండనిన
బహుభాషరచనలు
చేసెననిన

ప్రథమాంధ్రకవులలో
అగ్రగణ్యుడనిన
పాల్కుర్కిసోమన
స్ఫురణకొచ్చు

ద్విపదరచన
దివ్యరచన
తొట్టతొలితెలుగు
శతకరచన

సోమనాథుడుచేత
పట్టిందిబంగారు
అసలుసిసలుతెలుగు
కవులతీరు
************

ప్రౌఢ సాహిత్యాన
గౌడ డిండిమ భట్టు
గర్వభంగము జేసి
గౌరవించి

గండపెండేరాలు
గజారోహణాలు
తురగభూషణాలు
పరగణాలు

రెడ్డిరాజులచేత
దొడ్డసత్కారాలు
రాజభోగాలెన్నొ
అనుభవించి



PDF created with pdfFactory Pro trial version www.pdffactory.com

ఒడ్డెరాజులచేత
చెడ్డచీత్కారాలు
గడ్డుకాలపుస్థితుల
గతుల జూసి

శృంగారగంగలో
మునకలెత్తించిన
పొంగారుప్రాయాన్ని
ఉరకలెత్తించిన

గుక్కనీటికొరకు
తిక్కశంకరునైన
చక్కనిఆశువుతొ
వెక్కిరించిన

శ్రీనాథుడొక్కడే
కవిసార్వభౌముడు
సూర్యచంద్రుల
కాంతులున్నదాక

శ్రీనాథుడొక్కడే
రసరాజపురుషుడు
కవిలోకసామ్రాజ్య-
మున్నదాక
****************

రాముడేమడిగెనో
రాయమనిచెప్పెనో
సహజపాండిత్యాన
పోతనేరాసెనో

పరమార్థమగుభక్తి
నేరుగాపేరుగా
అవతారగాధలే
ఆలవాలముగా

అలరించగా ఆ-
బాలగోపాలము
ఆలకించగాఅమూ-
లాగ్రసంసారము

Final



PDF created with pdfFactory Pro trial version www.pdffactory.com

కృష్ణలీలామృతము
ఆంధ్రభాగవతము
ముక్తిమార్గానికే
దివ్యపథము
*********
సాహితీరంగాన
సమరరంగాన
సరసపోషణలోన
సరళిలోన

విజయనగర ప్రభల్
వినువీధులన్ మెరయ
అష్టదిగ్గజాలఅక్ష-
రామృతమరయ

స్పష్టమైనతెలుగు
జయకేతనంబెగయ
అత్యంతమాధుర్య రస-
వృష్టికురియ

కవనపానముగ్రోలి
భువనవిజయమునేలె
తేటతెల్గు పట్టుకృష్ణ-
రాయసామ్రాట్టు
****************
మనుచరిత్రమను కావ్య-
పఠనమింతేచాలు
అణువణువు పులకించి
అనుభవింప

సరస శృంగారాలు
సౌందర్యవర్ణనలు
సొంపుసోయగాలు
కనులలసింప

అల్లసానివాని
అల్లికజిగిబిగి
ఆంధ్రకవితాకీర్తి-
నినుమడింప

Final



PDF created with pdfFactory Pro trial version www.pdffactory.com

పడుచుప్రబంధాల
పరిమళాలెగదన్న
దొడ్డకవితకు పేరు
పెట్టిందిపెద్దన్న
*************

ద్వ్యర్థి కావ్యమురాసె
కావ్యార్థమొప్పగా
అలనాడు ఆ ఆంధ్ర-
భోజుడికి మెప్పుగా

కల్పితము కమనీయ-
శిల్పితము రమణీయ-
రూపితము రచనలో
రసదీపితంబై

నాటకీయతలోన
కథా కథనములోన
ఆంధ్రసాహిత్యాన
ఆదినవలనదగిన

కళాపూర్ణోదయము
కవితాఉషోదయము
సూరకవి విరచితము
మనకుచిరపరిచితము
*****************

కాళహస్తీశ్వరుని
కాలమహిమలగూర్చి
సంసారబంధాల
సమస్యలగూర్చి

భక్తిపరవశాన
ముక్తిమార్గముజూపి
అరుదైనగౌరవము
శతకసాహితికిచ్చి

నిరసించినారాజ-
నీతినిఖ్యాతిని
నివసించినారాజ-
హృదయాంతరాళాన



Final

PDF created with pdfFactory Pro trial version www.pdffactory.com

వినుతించినా విశ్వ-
నటచక్రవర్తిని
ఎన్నగాలేరెవరు
ధూర్జటికిమిన్న
****************
ఉన్నదేలేదంటు
లేనిదేఉందంటు
ఉండిలేదనిలేక-
ఉన్నదంటూ

అటుదిప్పి ఇటుదిప్పి
ఇటుదిప్పి అటుదిప్పి
ఎటుదిప్పిచెప్పినా
ఏగుట్టువిప్పినా

హాస్యోక్తులైనా
వ్యంగ్యోక్తులైనా
చతురోక్తులైనా
చర్చితయుక్తులైనా

రామలింగడురామ-
లింగనికెసాటి
వికటకవిలోకాన
వెలుగుదివిటి
***************
త్యాగరాజుపలుకు
క్షేత్రయ్యపలుకు
అన్నమయ్యపలుకు
అసలుపలుకు

రామదాసుపలుకు
రామునిపలుకు
భక్తికవులపలుకు
భక్తిపలుకు

కర్ణాటకాంధ్ర
సంగీతగగనాన
సరగమల స్వరగతుల
సంగతులలోన

Final



PDF created with pdfFactory Pro trial version www.pdffactory.com

సాంప్రదాయబద్ధ
శుద్ధరాగాలతో
భావరంజితమైన
భక్తిలోన

తెలుగుతారకవెలయ
వెలుగుదీప్తులలయ
గానామృతముకురియ
గర్జనలుసేయ

నిరంతరసంగీత
నిర్ ఝరులుపార
దిగంతల్దాటినది
కీర్తనలధార

త్యాగరాజువలన
శ్యామశాస్త్రివలన
ముత్తుస్వామి-
దీక్షితులవలన

మువ్వగోపాలుని
మద్దుముద్దుపలుకు
క్షేత్రయ్య పదములో
కొలువుదీరు

కంచర్లగోపన్న
కష్టాలకన్నీరు
రామసంకీర్తనలా
సేదదీరు

ఒక్కొక్కవాగ్గేయకారు-
డొకసంద్రం
ఉప్పొంగుసంగీత-
సాహితీతరంగం
*****************
ఏడుకొండలవాని-
దెంత అదృష్టమో
అన్నమాచార్యుడే
వేడుకొనెగా

Final



PDF created with pdfFactory Pro trial version www.pdffactory.com

వేదమంత్రములల్లె
వేలపదములనల్లి
వేంకటేశుడిమదిని
ఏలుకొనగా

ఒక్కొక్కపదములో
ఒలుకుముత్యాలు
ఒక్కొక్కపదము లో
చిలుకు రతనాలు

సంకీర్తనాచార్యు
సరిగమలఝరిలోన
సరసమాడేను సం-
గీత సాహిత్యాలు

జోలపాడేవేళ
బుజ్జగించే పదము
బుద్ధిచెప్పేవేళ
ఒజ్జపదము

జనులగొంతులోన
జవసత్వములునింపి
కనువిప్పుకలిగించు
జానపదము

పల్లకీమోసి మరి
పాడించుకొనినాడు
పల్లవపాణియని
ప్రతీతికాద

ఆంధ్రపదకవితకు
ఆదిగురువువైన
అన్నమయ్యకదియె
మోక్షమ్ముగాద
*************
రాజ్యపాలనలో
రాజకీయములోన
సాహిత్యరచనలో
సాహసములో

Final



PDF created with pdfFactory Pro trial version www.pdffactory.com

ఆరితేరినవాడు
అరుదైనవాడు
అన్నివిషయాలలో
అపరకృష్ణరాయలు

రఘునాథనాయకులు
రాజ్యమేలిననాడు
తమిళనాడునుతాకె
తెలుగుక్రైత

తంజాపురినకిరణ-
పుంజాలువిచ్చుకొని
విలసిల్లెవిల్లువైన
సాహిత్యచరిత

చమత్కృతశృంగార-
రసద్యుతిలో
సౌందర్యవర్ణనల
సమశృతిలో

చేయిదిరిగినట్టి
రచనలేచేపట్టి
విజయవిలాసము
ప్రదర్శించినట్టి

చేమకూరవేంకట-
కవీశ్వరుడు
రఘునాథనాయకుని
ఆస్థానవిభుడు

సరసరచనలోన
పురుషులనుమించి
శృంగారభావాలు
రంగరించి

కవితలల్లినఆంధ్ర-
కవితాశిరోమణి
ముద్దుముద్దుపలుకుల
ముద్దుపళని

Final



PDF created with pdfFactory Pro trial version www.pdffactory.com

దక్షిణాంధ్రయుగపు
దక్షతకలిగిన
లాక్షణికులసరస-
శృంగారభరణి
*************

రాసినారెందరో
రామచంద్రచరిత
వెలయగావిలువైన
విషయబాహుళ్యత

వాల్మీకివాసనలు
ఇంపుగాపెంపుగా
వాసికెక్కెకొన్ని
స్రుక్కెకొన్ని

గోనబుద్దారెడ్డి
వీనులవిందుగా
రచియించెతెలుగులో
తొట్టతొలిగా

సులభగ్రాహ్యమైన
వ్యవహారశైలిలో
జానపదులగుండె
వేణువూది

రాసెరంగనాథ-
రామాయణమనుపేర
రమణీయకావ్యత
కొలువుదీర

చదువగానోరూర
చరితార్థమేకదా
సర్వదాశ్రీరామ-
చంద్రుగాథ
****************

లెక్కింపదగ్గనైన
ఒక్కకావ్యముజాలు
లెక్కలేనిరుచులు
పుక్కిలింప

Final



PDF created with pdfFactory Pro trial version www.pdffactory.com

మొల్లరామాయణం-
బట్టిదేగామరి
ఎల్లరామాయణా-
లాలకింప

శ్రీకంఠమల్లేశుడే
కంటజూసెనో
మొక్కవోనిదీక్ష
మొల్లకిచ్చె

తనదైనశైలిలో
రామాయణమురాసి
కవయిత్రిమొల్లతన
జనులకిచ్చె

తీయతీయనితెలుగు
మాటలను కూర్చి
భావవసూత్రమునకే
బాగుగాకుచ్చె

నీలమేఘశ్యాము
డెందమునసవరించి
మధురమైనతెలుగు
పరిమళాలందించి

ఏకపత్నీవ్రతుని
ఎదనుదోచుకున్న
ఏకైకకావ్యమై
వెలుగుతున్న

మొల్లరామాయణము
మోక్షపారాయణము
భక్తి సాహిత్యాన
మేరునగము
**********

నీతివాక్యములనిన
నిజములనిన
మధురవాక్కులనిన
మంచియనిన

Final



PDF created with pdfFactory Pro trial version www.pdffactory.com

జరుగుతున్నతప్పు
జరగకూడనితప్పు
జాతిజనులముప్పు
చేతలనిన

కనువిప్పుకలుగగా
గొప్పవారిమెప్పు
పూసగచ్చినట్టు
చెప్పుటనిన

పండితుల్కైనా
పామరుల్కైనా
ప్రగల్భాల్పలికే
పాలకుల్కైనా

ఆవుపాలలాంటి
అచ్చమైనతెలుగు
పదములల్లి మదిని
గిల్లుటైనా

ఆంధ్రసాహిత్యాన
శతకాలకేచెల్లు
నీతిశతకమువినిన
పులకరించుఒళ్ళు

Final

వేదాలసారాన్ని
వేదనలసారాన్ని
బాధలసారాన్ని
బాధ్యతలసారాన్ని

సుగుణాలసారాన్ని
సూక్ష్మసారాన్ని
సూచనలసారాన్ని
సులభసారాన్ని

అన్నింటీనీకలిపి
అనుభవాలనుతెలిపి
అరటిపండువొలిచి
చేతిలోనిలిపి



PDF created with pdfFactory Pro trial version www.pdffactory.com

వివరించినావిషయ
విజ్ఞానమేబెరుగ
విడమరచినాజనుల-
కాలోచనేకలుగ

వలదువేలకొలది
వట్టిపద్యాలు
చాలుచాలుచాలు
చాలుచాలు

ఒక్కవేమనపద్య-
మొక్కభాస్కరపద్య-
మొక్కసుమతీపద్య-
మొక్కపద్యం
****************
వేమన్నఏమన్న
వెన్నులోచలిబుట్టు
లోనున్నవిషయాల
గుట్టురట్టు

నిర్వికారమైన
నిర్వ్యాజమైన
నిత్యసత్యమైన
నిత్యమయిన

వేలాదిపద్యాలు
తేలగారాసి
వొంగించెతెలుగులో
శతకవారాశి

అందుకేవేమన్న
అరుదైనవ్యక్తి
సాటిలేనిఆంధ్ర-
సమ్మోహనాశక్తి

తెలుగుసాహిత్యాన్ని
వెలుగువెలిగించిన
పండితులపామరుల
ప్రజలలోకోక్తి

Final



PDF created with pdfFactory Pro trial version www.pdffactory.com

వేమన్నపద్యము
రానివాడులేడు
రానివాడుతెలుగు-
వాడుకాడు
************

ఆంధ్రులేఅంధులై
అన్నిమరచిననాడు
ఆంగిలేయుడొక్క-
డరుగుదెంచె

కడపసీమలోకాలు-
పెట్టిందిమొదలు
కవితావికాసమ్ము
కాంతులీనె

కరపత్రములదీసి
అచ్చువేయించె
పాతకవితకుకొత్త
జీవమందించె

ఆంధ్రసాహిత్యాన్ని
ఆస్తిగాభావించి
ఆర్తిపెంపొందించి
పులకరించె

వెలగట్టలేని
వెలవెలబోతున్న
వేలాదిప్రతులను
వెదికిపెట్టించె

గుదిగుచ్చగతకీర్తి
చిహ్నాలువెలయగా
సాహితీలతలెన్నొ
సంగడించె

విరియగాసౌరభాల్
విద్యావికాసమున
విలువైననిఘంటువు-
ల్విరచియించె

Final



PDF created with pdfFactory Pro trial version www.pdffactory.com

ఆంధ్రత్వమునునమ్మి
ఆస్తులనుతెగనమ్మి
నిస్వార్థసేవతో
నిజమునమ్మి

ఆంధ్రసాహితిచరిత
ఆతిథ్యమివ్వగా
అరుదైనస్థానమే
ఆర్జించుకొనగా

ఛార్లెస్ ఫిలిప్ బ్రౌన్
ఒక్కడేఒక్కడు
పుట్టలేదటువంటి
వాడుఇంకొక్కడు
**************

కాలానుగతముగా
కవులెందరోబుట్టి
రచనచేపట్టి
రాణించినట్టి

వివిధప్రక్రియలు
వివిధపద్ధతులు
వివిధవిషయాలపై
విలువైనప్రతులు

చెప్పగాఎన్నెన్నో
గొప్పరచనలు
చదువగాఎన్నెన్నో
చక్కటిరచనలు

పురాకృతపుణ్యమై
మనకులభియించినవి
తెలుగుభారతికంఠ-
హారమైనిలిచినవి

ఆధునికధోరణులు
అభ్యుదయధోరణులు
నవ్యసాంప్రదాయ
భవ్యధోరణులు

Final



PDF created with pdfFactory Pro trial version www.pdffactory.com

ఛందస్సుచెరవీడి
బంధాలుతెంచుకొని
బయటపడిబయలిడిన
భావవారుణులు

ఉడుకునెత్తురుసెగల
ఉప్పెనలఊహాలు
దుడుకుచేష్టల
దుందుడుకుపోగలు

దిగంబరవాదనలు
ధిక్కారవాదనలు
స్త్రీలదళితులవర్గ
పీడితరోదనలు

మసకబారెనుకొన్ని
మంచినేర్పెనుకొన్ని
సాహితీక్షేత్రాన్ని
కలయదున్ని
**********
వెనుకబాటుతనము
వెర్రితలలువేయ
కవులముందుచూపు
రంకెలేయ

సాంఘికచైతన్య
సత్కర్మబుద్ధితో
సన్మార్గమునిజూపి
సందడిసేయ

మూఢనమ్మకాల
ముదురుగోడలుచీల్చి
విషయవిజ్ఞానమే
చిందులేయ

అభ్యుదయభావాల
ఆధునికపోకడలు
సమసమాజానికై
స్ఫూర్తినీయ

Final



PDF created with pdfFactory Pro trial version www.pdffactory.com

కందుకూరికీర్తి
గురజాడఆర్తి
కలబోసుకున్నట్టి
ఆంధ్రకవితామూర్తి

చరితలోమిగిలింది
చైతన్యమందించి
చరితసృష్టించింది
ఘీంకరించి
*************

చిలకమర్తివారు
చిన్నగాపలికినా
గోదారిగంగలై
పారునాడు

దేశభక్తికవిత
మోసులెత్తంగనే
రాజమహేంద్రి
కుసుమించునాడు

జాజిమల్లెలమించి
జాతీయపరిమళము
జనులగుండెలధ్వనులు
సేయునాడు

తూటాలమాతెలుగు
మాటలకుబెదిరి
తెల్లవాడుతెల్ల-
బోవునాడు

తెలుగుకవితకుకొత్త
కోకకట్టినటుల
సరికొత్తపోకడలు
పొడలుసూపె

స్వేచ్ఛావాయువులు
వీచేటిదిశగా
సారస్వమేశాంతి
బాటలేసె



Final

PDF created with pdfFactory Pro trial version www.pdffactory.com

అసిధారవ్రతమైన
అవధానమన్నదే
ఆంధ్రసాహిత్యాన
వ్యవధానమవ్వగా

వాగ్ధాటిలో తెలుగు
వక్త్రోక్తి చెలగి
జంటకవుల ప్రతిభ
మింటినే అంటగా

ధారణకుపేరైన
దండివైన
పదగుంఫనాలున్న
పద్యములనెన్నో

పలికించగాతిరుపతి-
వేంకటకవులు
రిక్కించి వినవచ్చు
రెండుచెవులు
**************

పాతరీతులప్రభల
వెలుగుతగ్గనీక
కొత్తరీతులప్రబల
శక్తులనుకాదనక

ఛందోబద్ధమైన
సుందరరచనలు
అందరికి అర్థమగు
వచనరచనలునూ

పాటలూ పద్యాలు
గేయాలుగీతాలు
కావ్యాలుకథలు
నవలలూనాటికలు

అన్నిప్రక్రియలనూ
అనువుగాచేపట్టి
అన్నిభావాలను
చేతబట్టి

Final



PDF created with pdfFactory Pro trial version www.pdffactory.com

ఆంధ్రసాహిత్యమును
మధువుపంచిపెట్టి
సాహితీలోకాన్ని
సంతోషపెట్టి

కలనేతఅయిన
కళాధినేత
కవిసామ్రాట్టు
మన విశ్వనాథ
***********

తమజాతిఉద్ధరణ
సమజాత్యోద్ధరణ
సమసమాజాన్నికై
సాటిలేనిస్ఫురణ

పెంపొందిపేరొంది
నొచ్చుకొనగామంది
విచ్చుకొనెసౌజన్య
సాహిత్యసౌగంధి

సరికొత్తఊహల
పరిమళాలందించి
పాతచంధస్సునే
పల్లవించి

ఒడుపుగాతనదైన
ఒద్దికైన
నేర్పుగామృదువైన
గడుసుదైన

వ్యవహారశైలిలో
వేదనలవృత్తాలు
వెన్నులోచలిబుట్టు
వెతలకతలు

సూటిగాదీటుగా
ఘాటుగానేటుగా
ఆటుపోటువోలె
అలవాటుగా

Final



PDF created with pdfFactory Pro trial version www.pdffactory.com

గబ్బిలానికిగూడ
గమకాలునేర్పించి
పరమశివునికడకు
పంపించిప్రార్థించి

వినుతికెక్కెనుగదా
భేషుగాజాషువా
భావగాంభీర్యాన
బ్రతుకుబాసటగా
***************
అతనిఊహాలధాటి
తాకెనల్దెసల
ఆంధ్రదేశముదాటి
జాతీయకొసల

విశ్వాంతరాళాన
విజయదుందుభిమ్రోగి
విషన్నవదనాన
కాంతిరేఖలురేగి

ఛిధ్నమైనబ్రతుకు
చిమ్మచీకట్లలో
చిరుదివ్వెలైవెలిగి
చిందులేయ

ఎందుకనిప్రశ్నించి
ముందుకేసాగమని
అందినది అందుకొని
అందరికిపంచమని

అస్త్రాలుసంధించి
శస్త్రాలుసవరించి
నిస్త్రాణముననిత్య-
తేజమ్మురగిలించి

దారుణాలసిగలు
ఖండించిదహియించి
మారణహోమాల
మకిలిరహియించి



PDF created with pdfFactory Pro trial version www.pdffactory.com

కార్మికుడిగుండెలో
కర్షకుడిగుడిసెలో
శ్రామికుడిమనసులో
మనసున్నమనిషిలో

మనిషిగాజీవించి
మానవత్వముపెంచి
మంచిమార్పున్కై
మరిమరిఘోషించి

తెలుగుసాహిత్యాన్ని
ఒక్కకుదుపుకుదిపి
తెటతెల్లముజేసె
తెలుగు,వాడివేడి

మహారాజశ్రీ
మహాకవిశ్రీశ్రీ
గాలినేడలుగట్టు
గడుసైనమేస్త్రి
**************

అమలినశృంగార-
మమరుచందమున
ఆంధ్రకవితాదీప్తి
విరిసెనందముగా

అభ్యుదయభావాల
అరుదైనభాష్యాలు
దేశభక్తినిదెల్పు
దివ్యోపదేశాలు

విశ్వకవిరవీంద్రు
విషయసాంగత్యాన
శాంతినికేతనపు
ప్రశాంతతత్వాన

వికసించగాభావ
జాతీయకుసుమాలు
భారతీయులభవ్య
సాంస్కృతికవాసనలు



PDF created with pdfFactory Pro trial version www.pdffactory.com

ఆంధ్రతేజత్వమే
సాక్షాత్కరింప
ఆంధ్రఔన్నత్యమే
అందరికిఎరిగింప

భరతమాతమీద
తెలుగువారిభక్తి
భావిభారతశోభ-
నినుమడింప

ఏదేశమేగినా
ఈదేశ ఖ్యాతిని
సందేశముగసకల
లోకానవినుతింప

పొరలించెగాతెలుగు
సాహితీసిరులు
మేలుకొలుపువోలె
రాయప్రోలు
**************
అతనితేనియలూరు
పలుకునిన్నంతనే
కోకిలమ్మకుకొత్త-
సిగ్గుబుట్టు

చిగురటాకులకైన
చిలిపిఊహలురేగి
వగరుమామిడిపైన
వలపుబుట్టు

చిరుగాలిసవ్వడులు
పెనవేసుకొన్నటుల
సెలయేటిపరుగులకు
సెగలుబుట్టు

వయ్యారివయసులా
వన్నెతగ్గనీక
ప్రకృతికాంతమనసు
పరుగువెట్టు

Final



PDF created with pdfFactory Pro trial version www.pdffactory.com

భావభాసితమైన
రాగరంజితమైన
రసలోకహృదయ
సామ్రాజ్యదీపితమై

స్వేచ్ఛావిహంగములె-
దేచ్ఛగావిహరించ
తెలుగుసాహిత్యాన
నవ్యతేఉదయించ

కాల్పనికయుగమునకు
కల్పనేచేసి
భావసాహిత్యపు
బాటలేవేసి

ఊహాకందనిఉరుకు
పరుగులనునేర్పించి
కొత్త ఉరవడినిచ్చె
కృష్ణశాస్త్రి
**************

నైజామునీడలో
నైరాశ్యమునువీడి
వైదగ్ధిగా మారి
వ్రాసికొనగా

తెలుగుసాహిత్యమే
కొత్తపుంతలుతొక్కె
రాష్ట్రాభిమానమ్ము
రాజుకొనగా

జాతీయభావాలు
జాతిజనులనుచేరి
దేశభక్తినూత్న
ఉత్తేజమివ్వగా

ఆంధ్రసాహిత్యాన
తాను ఉన్నానంచు
తెలగాంణాగొంతు
విచ్చికొనగా

Final



PDF created with pdfFactory Pro trial version www.pdffactory.com

మాతెలంగాణమ్ము
మట్టివాసనలోన
సాహితీకుసుమాలు
నాటుకొనగా

తెలంగాణాతెలుగు
రచనలకు సారధి
మృదుమధురవాక్కుల
మహాకవిదాశరధి

సింగిరెడ్డివారి
చిత్తమేపొత్తము
అందులోఅణువణువు
ఆంధ్రమేమొత్తము

ఉరుదూ ఉషస్సుతో
ఉరకలేవేయించి
తెలుగుతేజస్సుతో
పరుగుపెట్టించి

చిత్రసీమలోని
చిత్రాలుచూపించి
చిరస్థాయిగ జ్ఞాన-
పీఠమ్మునెక్కించి

తెలుగు గొప్పదనము
గొప్పగా ఒప్పగా
ఆధునిక సాహితికి
మార్గదర్శిగ నిలిచి

మార్పులను చేర్పులను
తరచితరచి చూసి
తప్పులను ఒప్పులను
తడిమి తడిమి చెప్పి

అర్ధశతాబ్దిగా
ఆంధ్రసాహిత్యాన్ని
అలసటన్నదిలేక
ఆదరించె

Final



PDF created with pdfFactory Pro trial version www.pdffactory.com

తెలంగాణ తళుకు
తెలుగువాణిబెళుకు
మధురమైనపలుకు
మనసుపలుకు

భళారే!భళారే!
అననివారులేరె!
నవ్యసాహిత్యాన
జీవనది సినారె!

*************

తెలుగుముంగిళ్ళలో
ముగ్గులేవేసి
తెలుగుమహిళామణుల
మనసుదోచి

వార్తాపత్రికల
వారపత్రికల
పెంపునకునేరుగా
బాటలేసి

వ్యక్తిత్వవికాస
వివేచనపెంచి
సాంఘికజీవనపు
సంగతులుపంచి

నవనవలాడిన
నవలాప్రక్రియ
పాఠకలోకాన
పడుచు సఖియ
***************

నలుగురినిమెప్పించి
నవ్యతనుచొప్పించి
చతుర్విధ అభినయపు
చతురతనుగుప్పించి

నవరసాలనుకలిపి
నాట్యమాడించి
రంగస్థలముపైన
రసికతతోరాణించి

Final



PDF created with pdfFactory Pro trial version www.pdffactory.com

చదువరులచూపరుల
చదువురానిజనుల
వీక్షించవిలువైన
విషయాలుబోధించి

తెలుగుసాహిత్యాన
కొత్తవెలుగునింపి
సమసమాజానికై
చైతన్యమందించి

బడుగుజీవుడిబ్రతుకు
వెతలకతలైనా
బాధ్యాతాయుతమైన
బాధలైనా

తెరలకెక్కించిన
తెలుగునాటకమ్ము
దృశ్యరూపకావ్య-
కన్యకాభరణమ్ము
***************

ఎత్తుగడలోతీరు
నడకతీరు
పాత్రఔచిత్యాల
పలుకుతీరు

నిక్షిప్తమైసకల
సంక్షిప్తమైసహజ-
శైలిలోసాగేటి
మాటతీరు

నిర్దిష్టసాహిత్య
నిజరూపమునుబూని
నిశితవిమర్శలు
చేయబోసి

వాస్తవికధోరణుల
పరిపూర్ణప్రక్రియ
వైజ్ఞానికోల్లాస
వైశిష్టక్రియ



Final

PDF created with pdfFactory Pro trial version www.pdffactory.com

కాలాలుమారినా
కనుమరుగుకాక
"ఆకాశవాణి"నే
విడిచిపోక

అందరిచేరువైన
అత్యంత ఆధునిక-
విషయాలవీచిక
తెలుగుకథానిక
****************
గాయపడినమనసు
తెలుగుగేయమువిన్న
హాయిగాతేరుకొని
కుదుటపడగా

భారమైనబ్రతుకు
భావలాలిత్యాన
బాధమరచిపోయి
బాగుపడగా

తెలుగుగొప్పదనము
కొంతతెలియవచ్చు
చింతలోనచిగురు
చింతవోలె

తమిళులెందరొతెలుగు
పాటలేపాడి
మధురసంకీర్తనల
మునిగితేలి

సరిలేనికీర్తినే
ఆర్జించుకొన్నారు
సంగీతమునసకల
లోకాలనేలి

మరచిపోయినకళలు
మరలగుర్తించగా
తెలుగుసాహిత్యాన
కోకొల్లలూ

Final



PDF created with pdfFactory Pro trial version www.pdffactory.com

తరచిచూడగా
తన్మయత్వముబొంది
పారవశ్యానికే
లేవెల్లలూ

మధుర్మైన తెలుగు
గొప్పదనమేఇది
కాక,ఇంకేదియూ
కానేరదు

ఎంతచెప్పికొనిన
అంతులేనికీర్తి
సంతసంబేగాని
సంశయంబేల
*************

నవీనీకరణలోనాల్గు-
మాటలునేర్చి
నలుగురితోభావాలు
పంచుకొనగా

సృజనాత్మకతాపెరిగి
బుద్ధిమాంద్యముతరిగి
సరికొత్తభావనలు
తెలిసికొనగా

అనువాదమునకిది
అనువైనభాష
అనువాదమున్నదది
ఎంతనిజమో

అనుభవజ్ఞులనడిగి
అసలువిషయమరిగి
సంతోషపడవచ్చు
సత్యమైన
*************

దేశదేశాలలో
తెలుగువారికీర్తి
దేదీప్యమానముగ
వెలుగుచుండ

Final



PDF created with pdfFactory Pro trial version www.pdffactory.com

ఉండబట్టలేక
తెలుగుతల్లిమనసు
ఉప్పొంగిఉరకలే
వేయుచుండ

బండరాయినివీడి
తెలుగుతల్లి
భాగ్యనగరినిదిరుగ
బయలుదేరె

భాగ్యనగరిదెంత
దౌర్భాగ్యమోగదా
తెలుగుతల్లినిగుర్తు-
బట్టలేదు

తెలుగువానికి
తెలుగురాజధానికి
తెలుగువాణిఒంట-
బట్టినట్టులేదు

బుట్టదాఖలయిన
గతకీర్తిచిహ్నాలు
మట్టిలోగలిసెనని
మథనపడుతూ

ఖిన్నురాలైనట్టి
తెలుగుతల్లిమనసు
చిన్నబోయికడకు
వెన్నుదిరిగె
**************

తెల్లవారిందంటె
తెలంగాణాపల్లె
మెల్లగాపలికేటి
జానపదము

దివిసీమలోదివ్య
రత్నకాంతులీని
దివిజత్వమొందిన
తెలుగుపదము

Final



PDF created with pdfFactory Pro trial version www.pdffactory.com

రాయలేలినసీమ
రాసిలోవాసిలో
రాటుదేలినట్టి
రాచపదము

త్రికలింగదేశాన
అకళంకమైనట్టి
అచ్చమైన అసలు
ఆంధ్రపదము

మాండలికపుమధుర
వాక్కులచమక్కులను
శిష్టవ్యవహారాన
క్లిష్టమగుచిక్కులను

ఇష్టమైనరీతి
స్పష్టమేచేసిన
ఉత్కృష్టమైనట్టి
ఉభయపదము

పలుకుమారెనునేడు
పలుకుటేమారె
పరికించిచూడగా
పలుకుబేజారే

ఎందుకని అడిగితే
ఎవరుచెప్పగరారె
తెలుసుకొన్నవారె
తెలివైనవారె
************

ఉగాదిపేరిట
ఉత్సవాలనుజరిపి
ఊకదంపుడుఉప-
న్యాసమ్ములిచ్చి

ఒక్కరోజులోనె
ఎక్కసంబైనటుల
తెల్లవారితెలుగు
మరిచిపోయి

Final



PDF created with pdfFactory Pro trial version www.pdffactory.com

శుష్కవాగ్దానాలు
పుష్కలంగాచేయు
నాయకాగ్రేసరుల
నటనములకు

నవ్వలేకతెలుగు
నవ్వుకుంటోంది
ఏడ్వలేకతెలుగు
ఏడ్వమంటోంది

విడమరచిచెబుతోంది
వినమంటుతనని
విధిలేక ఏ భాష
తనకింకరాదని
**************

అంకెలకుసంకెళ్ళు
వేసినారెప్పుడో
తరచిచూడగ
తరతరాలనాడు

భాషకికబంధాలు
వేయుచున్నారు
నవవికాసాన  నా-
తెలుగువారు

ప్రజలభాషలోన
పరిపాలనమునెరపి
ప్రజలచేరువగుట
సముచితంబు

ప్రజలగొంతులోన
పలుమార్లు పలికేటి
పలుకువిన్నప్రబల
సంతసంబు
**************

అధికారభాష ఇది
అధికారులకురాదు
అనధికారులకసలు
అలవాటులేదు

Final



PDF created with pdfFactory Pro trial version www.pdffactory.com

అచ్చుతప్పులున్న
అంతయో ఇంతయో
వొచ్చినాఒడుపుగా
మాట్లాడలేరు

రాజనీతిలోన
రాజకీయములోన
ప్రజలభాషలోన
పలుకవలెననిన

ప్రజలపేరుమీద
పదవులుబొందిన
అధినేతలకు అసలు
ధ్యాసలేదు

ఎంతసిగ్గుచేటు
ఎంతసిగ్గుచేటు
చెప్పికొన్నంతనే
చచ్చేంతనగుబాటు
************
అమ్మపాలతోటి
అ ఆలు నేర్పితే
జోలపాటనీకు
జేజేలుపలుకు

ఉగ్గుపాలతోటి
ఉ ఊలునేర్పితే
ఉయ్యాలనీకొరకు
తానుగాఊగు

అచ్చులన్నికలిపి
ముచ్చటగముద్దుగ
గోరుముద్దల్లాగ
గొంతులోపడిన

ఎక్కడికిపోదింక
చిక్కనైనతెలుగు
తరతరాల అంత-
రాలుదాటి

Final



PDF created with pdfFactory Pro trial version www.pdffactory.com

తెలుసుకో తెలుసుకో
ఓ తెలుగు"తల్లీ"
పిల్లలకుచెప్పమ్మ
మళ్ళీమళ్ళీ

తెలుగుగొప్పదనము
తెలియగావెలయగా
తెలుగుపాలిట నీవు
కల్పవల్లి
****************

నాన్నగారికిరాదు
నాకురానేల
అన్నకసలేరాదు
బాధఏల

అక్కయ్యకేంతెలుసు
అమ్మకేరానపుడు
అనుకోకురా నా
తెలుగుబాల

అమ్మనేఅడగరా
అ ఆలునేర్పమని
నాన్ననేఅడగరా
తెలుగుమాట్లాడమని

అన్నతోచెప్పరా
తెలుగులోచదవమని
అక్కయ్యతోకలసి
పద్యాలుపాడమని

ఆపైననీకింక
భయమేలరా
నిక్కమైనతెలుగు నీ
తోడునీడరా

తెలుసుకో తెలుసుకో
తెలుగుబాల
గోలకాదిదితెలుగు
భాషలీల
**************

Final



PDF created with pdfFactory Pro trial version www.pdffactory.com

ఇదిసాగుతున్నచరిత
ఆగేదికాదు
దాచిపెడదామన్న
దాగేదికాదు

సృష్టికర్తనీవె
స్థితివినీవె
లయకారుడివినీవె
లయవునీవె

తెలుగువాడినన్న
గర్వమేవుంటే
ఆత్మాభిమానమ్ము
అసలునీకుంటె

ఆంధ్రత్వమును
ఆంధ్రతేజత్వమును
తెలుగుధీరత్వమును
తెలుపుశూరత్వమును

తెలుగువాడికిపంచి
తెలుగుకీర్తిపెంచి
తెలుగుసారస్వాన్ని
సంస్కరించి

తెలుగుబడికివెళ్ళి
తెలుగులోమాట్లాడి
తెలుగులోఆడి ఇక
తెలుగులో పాడి

నీబోటివారికే నీవు
స్ఫూర్తిగనిలిచి
రాబోవువారికై
రాచబాటలువేసి

సాగిపోనీదోవ
సాగిపో!సాగిపో!
సాగిపో నీనావ
ఆగిపోక!

Final



PDF created with pdfFactory Pro trial version www.pdffactory.com

# కవి పరిచయం

శశికిరణాచారి 1979వ సంవత్సరంలో కరీంనగరం జిల్లా ఎగువమానేరు సమీప గ్రామమైన కొత్తపల్లిలో జన్మించారు. శ్రీమతి విజయ వరలక్ష్మి, శ్రీ కొమాండూరి దేశికాచార్యులు వారి తల్లిదండ్రులు. శశికిరణాచారి పదవ తరగతి వరకు కొత్తపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుకున్నారు. కామారెడ్డి ప్రభుత్వ కళాశాలలో ఇంటర్మీడియేట్ విద్యనభ్యసించి, ఉస్మానియా విశ్వ విద్యాలయ ఇంజనీరింగ్ కళాశాల నుండి 2000 సం॥లో సివిల్ ఇంజనీరింగ్ పట్టభద్రులైనారు. 2002 సం॥ నుండి ఆంధ్రప్రదేశ్ విద్యుత్ ప్రసార సంస్థ (ఏపిట్రాన్స్‌కో)లో సహాయక ఇంజనీరు (ఎ.ఇ.) గా పనిచేస్తున్నారు.

Final

PDF created with pdfFactory Pro trial version www.pdffactory.com



telugodu

shashikiranachary.k

Final

తెలుగుదనాన్ని గూర్చి, తెలుగువారి సంస్కృతిని గూర్చి సరళమైన శైలిలో దశలవారీగా రమ్యంగా వర్ణిస్తూ కవితా రూపంలో ఏర్చి కూర్చిన శ్రీ శశికిరణాచారిని హృదయపూర్వకంగా అభినందిస్తున్నాను.

- డా॥ వై.యస్. రాజశేఖర రెడ్డి

"ప్రతి తెలుగువానికి ఆత్మాభిమానం పరిపూర్ణంగా ఉన్నపుడే తెలుగుజాతి వ్యక్తిత్వం సమస్త భరతావనిలో అచంచలంగా నిలిచిపోతుంది. ఈ గేయకృతిని రచించడానికి ఉద్యుక్తుడైన శశికిరణాచారికి నా హార్దికాభినందన."

- డాక్టర్ సి. నారాయణ రెడ్డి.

PDF created with pdfFactory Pro trial version www.pdffactory.com